క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు(బృందావనం): నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న గీతామయి వృద్ధాశ్రమంలో వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తన మాతృమూర్తి సీతారామమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తులకు అన్న సంతర్పణ



నెల్లూరు(బారకాసు): రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తుల సౌకర్యార్థం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నాలుగు అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల ద్వారా భక్తులకు అన్నదానం చేస్తున్నారు. గురువారం 80 వేల మందికి పైగా అన్నదానం చేసినట్లు అధికారులు తెలిపారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న అనిల్

నెల్లూరు సిటీ: నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో గుండె ఆపరేషన్ బాధితురాలికి బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ సభ్యుడు చుక్కల అనిల్ స్వచ్ఛందంగా వైద్యశాలకు చేరుకొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆ సొసైటీ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యుడు సాయిరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు అనుమతించవద్దు



నెల్లూరు(దర్గామిట్ట): గత కొద్ది రోజులుగా నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ఇందుకు ఎలాంటి అనుమతి ఇవ్వొద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి గురువారం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ అంశం సున్నితమైందని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మిడతల రమేష్, కె.రాజేశ్వరి, రాధాకృష్ణగౌడ్, మొగరాళ్ల సురేష్, సుధీర్, ప్రవీణ్, రాజేష్, ఫణీంద్ర, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత వైద్యసేవలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నగరంలోని పలు ఆస్పత్రులు వైద్యశిబిరాలు నిర్వహిస్తూ ఉచిత వైద్యసేవలు అందిస్తున్నాయి. నగరంలోని ఆస్పత్రుల నిర్వాహకులు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రామచంద్రారెడ్డి నగర్ వద్ద ముంబై జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు కథనం మేరకు.. నంద్యాల నుంచి నెల్లూరు బారాషహీద్ దర్గాకు వెళ్తున్న తుఫాన్ వాహనం ముందు వెళ్తున్న ఎండ్ల బండిని ఢీకొట్టింది. ప్రమాదంలో ఎడ్లబండిలో ఉన్న దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు వెంకురెడ్డికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం మహోత్సవం

- బారాషహీద్ దర్గా ప్రాంగణంలో వేడుక
- గంధాన్ని అందుకునేందుకు పోటీ పడిన భక్తులు



గంధం కలుపుతున్న మత పెద్దలు

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా ప్రాంగణంలో రొట్టెల పండగ సందర్భంగా రెండో రోజు గురువారం గంధ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత కోటమిట్టలోని అమీనియా మసీదులో మతపెద్దలు, పీఠాధిపతుల ఆధ్వర్యంలో గంధ మహోత్సవం ప్రధాన కార్యనిర్వాహకుడు, మతపెద్ద సయ్యద్‌సమీహుస్సేని అత్తరు.. సుగంధ ద్రవ్యాలతో 12 బిందెలలో గంధాన్ని కలిపారు. ప్రత్యేక ప్రార్థనలు, నమాజులు నిర్వహించిన అనంతరం ప్రధాన బిందెను ముసవ్వీర్‌హుస్సేని ఎత్తుకున్నారు. అలాగే మిగిలిన 11 బిందెలను మరో 11 మంది ఎత్తుకున్నారు. తరుపరి ఆ బిందెలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై చేర్చారు. ముందు నిషాని జెండా వెళుతుండగా కోటమిట్ట, జెండావీధి, పెద్దబజారు, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీసు కార్యాలయం, డీకే డబ్ల్యూ కళాశాల మీదుగా దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా వద్దకు చేరుకున్నారు. నిషాని జెండాను తాకేందుకు భక్తులు ఉత్సాహం చూపారు.

సమాధులపై లేపనం

కడప పెద్ద దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేనీ, సయ్యద్ సమీహుస్సేనీల ఆధ్వర్యంలో ముజావర్లు, ఫకీర్లు తొలుత దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద నుంచి 12 బిందెలలో తెచ్చిన గంధాన్ని బారాషహీద్‌ల సమాధుపై లేపనం చేశారు. అనంతరం గంధాన్ని భక్తులకు పంచారు. గంధాన్ని అందుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు.



ఉత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులు



గంధ మహోత్సవంలో డప్పుల ప్రదర్శన

కుష్టు రహిత సమాజం కోసం కృషి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): కుష్టు రహిత సమాజం కోసం వైద్యసిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే సర్వేను నెల్లూరులోని రామచంద్రాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు, ఏఎన్‌ఎంలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఖాదర్‌వలీ మాట్లాడారు. జిల్లాలో కొత్తగా 99 మంది రోగులు చికిత్స పొందుతున్నారన్నారు. ఇటీవల వరికొండ, అలాగే వరికుంటపాడు మండలంలో ఒక్కో కేసు బయట పడిందన్నారు. అందువల్ల వైద్యసిబ్బంది సర్వేని పక్కాగా వచ్చే నెల 2వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం చేయిస్తే అంగవైకల్యానికి గురికాకుండా కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, డా.విష్ణుప్రియ, పీఎంఓ మల్లమ్మ, డీపీఎంఓ బీవీ సుబ్బయ్య, డీఎఫ్ఐటీ జోనల్ కో–ఆర్డినేటర్ సతీష్, ఫిజియోథెరపిస్ట్ నారాయణ, ఏపీఎంఓ రమణారెడ్డి, హెచ్‌వీ అమరావతి, సీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

రొట్టెల పండగ ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు(బారకాసు): నగరంలోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ సేదు మాధవన్‌లతో కలిసి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అనుక్షణం పర్యవేక్షించాలని సూచించారు. శుక్రవారం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బారాషహీద్ దర్గాకు వచ్చే భక్తులతో వర్చువల్‌గా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంత్రి వెంట నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దర్గా కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, అబ్దుల్ అజీజ్, గిరిధర్‌రెడ్డి, అదనపు ఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి బారాషహీద్ దర్గాను సందర్శించారు.

నేడు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సు

నెల్లూరు(బృందావనం): స్థానిక భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో శుక్రవారం ఉదయం 'స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం)' జిల్లా శాఖ సర్వసభ్య సమావేశంలో భాగంగా గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.జయరామ్ పెన్షనర్లకు గుండె సంబంధిత వ్యాధుల నివారణ, 'సీపీఆర్'పై అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పెన్షనర్లతోపాటు స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు సర్వసభ్య సమావేశం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెన్షనర్లు, సంఘం ఆఫీస్ బేరర్స్, కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులు తదితరులు హాజరుకావాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

నెల్లూరు(టౌన్): పిల్లల సమ్మిళిత అభివృద్ధి కోసం టీచ్ టూల్ ప్రోగ్రాం ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించేందుకు ఇస్తున్న శిక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ పీవీజే రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం స్థానిక పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఏఎంఓ సుధీర్‌బాబు, డిప్యూటీ ఈఓ ప్రసన్నలక్ష్మి, ఎంఈఓ మురళీధర్, టీచ్ టూల్ జిల్లా కోఆర్డినేటర్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ సునీష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం వాకర్స్‌కు కిడ్నీ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కిడ్నీ వ్యాధి నిపుణుడు డాక్టర్ సునీష్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కె.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు



నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగ సందర్భంగా దర్గా ప్రాంగణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. దర్గా ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో భక్తులకు అవసరమైన ప్రథమ చికిత్సలు చేస్తున్నారు. కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు నెల్లూరు క్లబ్‌లో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను రెండో రోజు గురువారం రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మేనేజింగ్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ అడ్వైజర్ చంద్రగిరి అజయ్, కన్వీనర్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, సురేష్, శ్రీరంజని, ప్రవీణ్‌కుమార్, రెడ్‌క్రాస్ వలంటీర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం



నెల్లూరు(అర్బన్): పర్యావరణాన్ని కాపాడేందుకు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జనవిజ్ఞాన వేదిక మహిళా విభాగం జిల్లా కన్వీనర్, విశ్రాంత ఉపాధ్యాయురాలు పి.విజయ పేర్కొన్నారు. గురువారం జేవీవీ సభ్యులు.. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మైపాడు గేటు సచివాలయం పరిధిలో, సమీప పార్కు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసేందుకు, వేసవిలో ఉష్ణోగ్రతలు తగ్గేందుకు చెట్లు ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కైనా నాటి సంరక్షించాలని సూచించారు.

మా భూమిని మాకు ఇప్పించండి



మాట్లాడుతున్న వాడా వెంకటసుబ్బమ్మ, కుమారుడు సుబ్బయ్య తదితరులు

నెల్లూరు(బారకాసు): తమ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్న వారి నుంచి తమకు ఇప్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సీతారామపురం గ్రామానికి చెందిన వాడా వెంకటసుబ్బమ్మ కుటుంబసభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. సీతారామపురం మండలం సీతారామపురం గ్రామంలోని 536 సర్వేనంబర్‌లో 5.69 ఎకరాల భూమి వాడ గోపయ్య(లేట్) పేరు మీద ఉందని, ఈ భూమిలో వర్షాధార పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే కొంతమంది అక్రమార్కులు స్థానిక రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై భూరికార్డులను తారుమారు చేసి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన షేక్ మహబూబ్‌బీ, భర్త మౌలానా పేరు మీద ఆన్‌లైన్ చేయించి వెనువెంటనే సయ్యద్ బీబీజాన్ భర్త చిన్నమౌలాలి పేరు మీద నంద్యాల జిల్లా కోవెలకుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించారని తెలిపారు. ఎలాంటి విచారణ లేకుండా ఈ–పాస్‌బుక్ కూడా మంజూరు చేశారని తెలిపారు. అక్రమంగా తమ భూమిని స్వాధీనం చేసుకోవడం, ఇతరుల పేరు మీద జరిగిన రిజిస్ట్రేషన్‌పై జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

నేడు కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు పప్పుల శ్రీనివాస్‌రావు, పిల్ల సుధాకర్, ఏర్రంశెట్టి పూర్ణమహేష్‌లపై జరిగిన దాడిని నిరసిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యాయాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి న్యాయవాదులపై దాడిని ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడికి నిరసనగా కోర్టు విధులు బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

ఆటోడ్రైవర్ మృతి

నెల్లూరు(క్రైమ్): ఆటోను బైక్ ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్ మృతిచెందాడు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం దొంతలి గ్రామానికి చెందిన టి.సుబ్బరాయుడు(50) ఆటోడ్రైవర్. ఆయన ఈ నెల 17వ తేదీ సాయంత్రం బుజబుజనెల్లూరు మీదుగా దొంతలి వెళుతుండగా మిట్టమీదకు వచ్చేసరికి బైక్ వేగంగా వచ్చి ఆటో ముందుచక్రాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన అతనిని చికిత్స నిమిత్తం స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. ఈ మేరకు గురువారం సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గణితంలో చిచ్చర పిడుగు

- నోబుల్ వరల్డ్ బుక్‌కు ఎంపిక



నోబుల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికైన వైష్ణవ్

నెల్లూరు(టౌన్): బుడిబుడి నడక సమయంలోనే గణితంపై ఆసక్తి పెంచుకున్నాడు పుచ్చకాయ వైష్ణవ్. జిల్లాలోని కోవూరుకు చెందిన రాజేష్ కుమార్ – సుజిత కుమారుడు వైష్ణవ్ నాలుగేళ్ల వయస్సులోనే 2 నుంచి 25 వరకు టేబుల్స్‌ను 14 సెకన్లలో చెప్పి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డులో ఎక్కి అబ్బుర పరిచాడు. ప్రస్తుతం ఐదున్నరేళ్ల వయస్సులో నేమింగ్ లార్జ్ నంబర్స్ 100 జీరోస్, 12 జీరోస్, 15 జీరోస్, గూగూల్ 100 జీరోస్, ఎన్యుమరేటింగ్ పాలిగాన్స్ విత్ 1 నుంచి 100 సైడ్స్ ఇన్ అండర్ 1 నిమిషం, రెక్టింగ్ స్క్వేరింగ్ రూట్స్ ఫ్రం 2 టు 35లు సాధించి నోబుల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వైష్ణవ్‌ను పలువురు అభినందించారు.

మట్టి స్వభావాన్ని తెలుసుకోవాలి

విడవలూరు : నేలలో పోషకాలు, వాటి ఉపయోగాలతో పాటు మట్టి స్వభావం గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆత్మ పీడీ దొరసాని అన్నారు. మండలంలోని అలగానిపాడు గ్రామంలో ఉన్న జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఏ శివన్నారాయణ మాట్లాడుతూ నేలలోని నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి సూక్ష్మధాతువుల గురించి తెలుసుకోవాలన్నారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్ పి.అనూష మట్టి నమూనాలను సేకరించే విధానం, ప్రయోగాలను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏ కె.కన్నయ్య, మండల ఏఓ పి.వెంకటకృష్ణయ్య, ఏఈఓ కిరణ్, వీఏఏలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల సిబ్బందికి శిక్షణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) సీఈఓలు, సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘాల కమిషనర్, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ సహకారంతో నగరంలోని జిల్లా సహకార శాఖాధికారి కార్యాలయంలో డీసీఓ గుర్రప్ప రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించి 'వాయిదా మీరిన బకాయిలపై చట్టపరమైన చర్యలు' అనే అంశంపై ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కావలి డివిజన్ సహకార శాఖాధికారి యలమందరావు, సహకార శిక్షణ కేంద్రం ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, జిల్లాలోని 78 పీఏసీఎస్ సంఘాల సీఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి శిక్షా సప్తాహ్

నెల్లూరు(టౌన్): జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీ నుంచి వారం రోజులపాటు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టిన తరువాత పరివర్తనాత్మక సంస్కరణలపై దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన సామగ్రిని తయారు చేసి ప్రదర్శించడం, 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించడం, 24న విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించడం. 25న విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం. 26న నూతన నైపుణ్యాల అవసరాలను గుర్తించడం, 27న పాఠశాలలో పోషణ దినోత్సవం నిర్వహణ, కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు వారి తల్లుల పేరుతో మొక్కలు నాటడం, సహపంక్తి భోజనాలు చేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

రైతుకు వెండి నాణెం అందజేత



రైతుకు వెండి నాణేన్ని అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నెల్లూరు సిటీ: కోరమాండల్ ఎరువులు తీసుకుని లాటరీలో గెలుపొందిన రైతు యనమల చిన్న వెంకటయ్యకు 50 గ్రాముల వెండి నాణేన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 2023–24 ఏడాదికిగాను రబీ సీజన్‌లో కోరమాండల్ 20–20 కొనుగోలు చేసిన రైతులకు అందజేసిన కూపన్ ద్వారా దుత్తలూరుకు చెందిన రైతు యనమల చిన్న వెంకటయ్యకు వెండి నాణెం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ నర్సోజీరావు, మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి పవన్‌కుమార్, కోరమాండల్ ఏజీఎం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేబు దొంగల బైండోవర్



జేబుదొంగలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు

నెల్లూరు(క్రైమ్): బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగలో జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశం ఉండడంతో సీసీఎస్ పోలీసులు వారి కదలికలపై నిఘా ఉంచారు. నగరంలో జేబు దొంగతనాలకు పాల్పడుతూ పోలీసు రికార్డుల్లో ఉన్న 9 మందిని గురువారం అదుపులోకి తీసుకుని సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానిక ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కోటేశ్వరరావు, సాంబశివరావు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వారిని బైండోవర్ చేశారు.

రామ్మూర్తి సేవలు చిరస్మరణీయం



నెల్లూరు(బృందావనం): సీనియర్ పాత్రికేయుడు సర్వేపల్లి రామ్మూర్తి సేవలు చిరస్మరణీయమని నారాయణ డెంటల్ కళాశాల హెచ్ఓడీ డాక్టర్ కన్నన్ తెలిపారు. ట్రంకురోడ్డు గాంధీబొమ్మ వద్ద ఉన్న తిప్పరాజు వారి సత్రంలో గురువారం సర్వేపల్లి రామ్మూర్తి సంస్మరణసభ నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.జయప్రకాస్, పాతూరి అన్నపూర్ణమ్మ, సింహపురి బాబు, గోపీనాథ్, వేలూరు సుబ్బారావు, అరవ రామ్మోహన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.